# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 13-06-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనలో 241మంది మరణించారు.**
2. **విమాన ప్రమాద ఘటనపై నిపుణులతో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రమంత్రి కె.రామ్మోహన్ నాయుడు వెల్లడించారు.**
3. **విశాఖపట్నంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటారని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ జాదవ్ చెప్పారు.**
4. **దేశ ఆర్థిక ఆరోగ్య భద్రతలో ఛార్టెర్డ్ ఎకౌంటెంట్‌లు కీలకపాత్ర పోషిస్తారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.**
5. **క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.**

==========================

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో- ఎఎఐబి అధికారిక దర్యాప్తును ప్రారంభించింది. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ నిర్దేశించిన అంతర్జాతీయ నిభందనల మేరకు దర్యాప్తు జరుగుతుందని కేంద్ర పౌర విమానయాన మంత్రి కె. రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసేందుకు నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. విమాన భద్రతను బలోపేతం చేయడానికి, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలను నివారించడానికి ఈ కమిటీ కృషి చేస్తుందని తెలుపుతూ..

..వాయిస్... 25 సెకన్లు

కాగా నిన్న అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానం కూలిపోవడంతో లండన్‌కు వెళ్లే విమానంలో 241 మంది మరణించారని ఎయిర్ ఇండియా ధృవీకరించింది. బోయింగ్ ఎఐ-171 విమానంలో 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారని, ప్రయాణికుల్లో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటిష్, ఏడుగురు పోర్చుగీస్, ఒక కెనడియన్ పౌరుడు ఉన్నారని తెలిపింది. ఈ ప్రమాదంలో గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్ రూపానీ కూడా మరణించారు. విశ్వాశ్ కుమార్ రమేష్ అనే ప్రయాణీకుడు ఒక్కరే ఈ ప్రమాదం నుండి బయటపడ్డాడని అధికారులు తెలిపారు.

ఇదిలా ఉండగా కేంద్ర హోంమంత్రి మంత్రి అమిత్ షా విమాన ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని నిన్న సందర్శించారు. ఈ సందర్భంగా సహాయక చర్యలపై కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్ మోహన్ నాయుడు, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అమిత్ షా పాత్రికేయులతో మాట్లాడుతూ, దురదృష్టకర సంఘటనతో యావత్ దేశం దిగ్భ్రాంతికి గురైందని, ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు దేశ పౌరులందరూ సంఘీభావం తెలుపుతున్నారని అన్నారు. ఈ సంఘటనకు కారణాన్ని తెలుసుకోవడానికి పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పటికే అధికారిక దర్యాప్తు ప్రారంభించిందని ఆయన పేర్కొంటూ,

వాయిస్ .. 21 సెకన్లు

---

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఈనెల 21వ తేదీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొంటారని కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాప్ జాదవ్ చెప్పారు. ఢిల్లీలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, 45 నిమిషాల పాటు యోగా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. యోగా దినోత్సవంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి తెలుపుతూ,

వాయిస్... 30 సెకన్లు

---

దేశ ఆర్థిక ఆరోగ్య భద్రతలో ఛార్టెర్డ్ ఎకౌంటెంట్‌లు –సీఏలు కీలకపాత్ర పోషిస్తారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెర్డ్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా –ఐసీఏఐ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో నిన్న మాదాపూర్‌లో సీఏ విద్యార్థుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉత్తీర్ణత సాధిస్తున్న సీఏ విద్యార్థుల్లోనూ తెలంగాణ ముందంజలో నిలుస్తోందన్నారు. వ్యాపార సంస్కరణలు, అంకుర సంస్థలకు, ప్రజా ఆర్థికవ్యవస్థల బలోపేతం వంటి అంశాల్లో సీఏల పాత్ర కీలకమని తెలిపారు.

---

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో ప్రజలకు ఆర్థిక భద్రత కల్పించిందని కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. కాకినాడలో 11 ఏళ్ల పాలనపై నిర్వహించిన నిపుణుల సదస్సులో కేంద్ర మంత్రి పాల్గొని మాట్లాడుతూ, ప్రధానమంత్రి దేశ రక్షణ రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి 34 లక్షల కోట్లు కేటాయించామని తెలిపారు.

---

అంతర్జాతీయ యోగా దినోత్సవ సన్నాహక కార్యక్రమాల్లో భాగంగా ఈ ఉదయం ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, ఆకాశవాణి హెడ్ ఆఫ్ ఆఫీస్ ఎమ్.సోమేశ్వరావు, సిబిసి అడిషనల్ డైరెక్టర్ రాజేంద్ర చౌదరి, ప్రాంతీయ వార్తావిభాగాధిపతి శ్రీసాయి వెంపాటితో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు.

---

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరంలో 7 కోట్ల రూపాయలతో నిర్మించనున్న క్రీడా మైదానానికి మంత్రి నిన్న శంఖుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభి వృద్ధితో పాటు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ అనేక పథకాలను అమలు చేశామని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పలు విధానాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ లో భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ, గ్రీన్ కో సంయుక్త ఆధ్వర్యంలో నిన్న నిర్వహించిన 14వ గ్రీన్ కో సదస్సులో మంత్రి పాల్గొన్నారు ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ, క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ 2025 ద్వారా 2030 నాటికి 20వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ లక్ష్యం సాధించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఇందిర సోలార్ జల్ వికాస్ పథకాన్ని 12 వేల 600 కోట్ల రూపాయలతో అమలు చేయడం ద్వారా 6 లక్షల ఎకరాలకు సౌరశక్తితో నడిచే నీటి పారుదల వ్యవస్థలను రూపొందిస్తామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకటరావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...20 సెకన్లు

తెలంగాణాలోని పలు జిల్లాల్లో రానున్న మూడు రోజులపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. మే 19 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించిన ఈ పరీక్ష ఫలితాలను అధికారులు గత సాయంత్రం విడుదల చేశారు. మొత్తం లక్షా 23 వేల 477మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 76.14శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. బాలురలో 73.55 శాతం, బాలికల్లో 80.10శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. విద్యార్థులు జూన్ 13 నుంచి 19వ తేదీ వరకు రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రీకౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు 5 వందల రూపాయలు రీవెరిఫికేషన్‌కు 1000 రూపాయలు చొప్పున చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

---------------------------

ఉత్తమ విద్యా నైపుణ్యాల కోసం నూతన విధానాన్ని రూపొందిస్తున్నామని తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లాలో ఏటూరు నాగారంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేసారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, విద్యా రంగానికి ప్రభుత్వం ప్రాధ్యానతనిస్తోందన్నారు.

====================